

నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
రాయదుర్గం	2,64,352	2,27,248	85.96 %
ఉరవకొండ	2,24,339	1,92,441	85.78 %
గుంతకల్లు	2,70,648	2,03,820	75.31 %
తాడిపత్రి	2,48,880	2,06,703	83.05 %
శింగనమల	2,47,373	2,05,068	82.90 %
అనంతపురం అర్బన్	2,81,214	1,83,018	65.08 %
కళ్యాణదుర్గం	2,30,785	2,05,143	88.89 %
రాప్తాడు	2,50,571	2,13,207	85.09 %
మొత్తం	**20,18,162**	**16,36,648**	**81.10**



విజయం మనదే..!

కూటమి అభ్యర్థుల్లో ధీమా

- వైసీపీ వారికి ఓటింగ్ సరళి గుబులు
- యువత, ఉద్యోగి ఓటు అటేనని దిగులు
- జిల్లాలో 81.10 శాతం పోలింగ్ నమోదు
- అత్యధికంగా కళ్యాణదుర్గంలో 88.89 శాతం
- అత్యల్పంగా అనంత అర్బన్‌లో 65.08 శాతం
- గత ఎన్నికలతో పోలిస్తే.. ఒక శాతమే పెరుగుదల
- లెక్కలు వేసుకోవడంలో అభ్యర్థులు బిజీ బిజీ



పోలింగ్ ముగిసింది. తీర్పు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, పోస్టల్ బ్యాలెట్లలో నిక్షిప్తమైంది. జేఎన్‌టీయూ స్ట్రాంగ్ రూంలలో.. కట్టుదిట్టమైన భద్రత నడుమ 'తీర్పు' సేదదీరుతోంది. ఆ తీర్పు అభ్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మరీ ముఖ్యంగా.. అధికార పార్టీవారికి..! యువత, మహిళ, ఉద్యోగి, ఉపాధ్యాయ వర్గాలలో అధికులు కూటమివైపే నిలిచారని, మిగిలిన వర్గాలు సైతం కూటమికే జైకొట్టారని అధికార పార్టీవారు భావిస్తున్నారు. విశ్లేషకులు సైతం ఇదే చెబుతున్నారు. కానీ తమకూ అవకాశాలు ఉన్నాయని వైసీపీ వారు భావిస్తున్నారు. జూన్ 4న కౌంటింగ్ జరిగే వరకూ ఈ చర్చలు, లెక్కాచారాలు కొనసాగుతాయి. గత ఎన్నికలతో పోలిస్తే.. జిల్లాలో పోలింగ్ శాతం స్వల్పంగానే పెరిగింది. మహిళలు.. పురుషులు పోటాపోటీగా పోటెత్తారు. తీర్పుకోసం అందరూ వేచి చూస్తున్నారు.

అనంతపురం, మే 14(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జిల్లాలో సోమవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ కొనసాగింది. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తడమే దీనికి ప్రధాన కారణం. జిల్లాలోని రాప్తాడు, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో మొత్తం 20,18,162 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 16,36,648 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన 3,81,514 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 81.10 శాతం పోలింగ్ నమోదైంది. 18.90 శాతం మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకోలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో (2019) జిల్లాలో 80.24 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఒక్క శాతం మాత్రమే పోలింగ్ పెరిగింది. జిల్లాలో అత్యధికంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 88.89 శాతం మంది పోలింగ్ నమోదైంది. విద్యాధికులు, మేధావులు, వ్యాపారులు, ఉద్యోగులు, యువతకు నెలవైన అనంతపురం అర్బన్‌లో కేవలం 65.08 శాతం పోలింగ్ నమోదై.. జిల్లా అట్టడుగున నిలిచింది. అర్బన్ ఓటర్ల తీరు పలువురిని ఆశ్చర్యపరిచింది.

పోటాపోటీ..

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మహిళలు, పురుషులు పోటీపడ్డారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 20,18,162 మంది కాగా.. అందులో 9,97,792 మంది పురుషులు, 10,20,124 మంది మహిళలు ఉన్నారు. 246 మంది ఇతరులు ఉన్నారు. పురుషులలో 8,17,536 మంది ఓటు హక్కును వినియోగించుకుని.. 81.9 శాతం పోలింగ్ నమోదు చేశారు. మహిళా ఓటర్లు 8,19,004 మంది ఓటు హక్కు వినియోగించుకుని.. 80.2 శాతంతో కాస్త వెనుకబడ్డారు. కానీ మొత్తంగా పోటా పోటీగా పోటెత్తారు. ఇతర ఓటర్లు మొత్తం 234 మంది ఉండగా 108 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

లెక్కల మంగళవారం

జిల్లాలో గెలుపోటములపై వైసీపీ, టీడీపీ కూటమి అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ తమ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్లను బేరీజు వేసుకుంటున్నారు. ఎవరికి ఎన్ని ఓట్లు పోలై ఉంటాయో పోలింగ్ ఏజెంట్ల నుంచి వివరాలు తీసుకుని.. కూడికలు, తీసివేతల్లో అభ్యర్థులు తలమునకలయ్యారు. ఏ వర్గాలు ఎవరికి అనుకూలంగా ఓటు వేశారు..? ఏ వర్గాలు ఓటు వేయలేదు..? ఏ గ్రామంలో ఎంత మెజార్టీ వస్తుంది..? ఎంత తగ్గుతుంది..?.. ఇలా లెక్కలేసుకుంటూ మంగళవారం బిజీ బిజీగా గడిపారు. గ్రామ, మండల, నియోజకవర్గస్థాయి నాయకులకు ఫోన్ చేసి.. పరిస్థితి ఏమిటని ఆరా తీశారు. గెలుపోటములపై చర్చలు.. లెక్కలు కొనసాగుతున్నాయి. తటస్థులకు సైతం ఫోన్‌లు చేసి ట్రెండ్ ఎలా ఉందని ఆరా తీస్తున్నారు. కౌంటింగ్ జరిగేందుకు మరో 20 రోజుల సమయం ఉంది. అప్పటి వరకూ అభ్యర్థులకు ఈ తిప్పలు తప్పేలా లేవు.

మహిళలు.. పురుషులు.. ఎక్కడెక్కడ.. ఎవరెవరి పోలింగ్ ఎలా..?

నియోజకవర్గం	పురుషులు	పోలైన ఓట్లు	శాతం	మహిళలు	పోలైన ఓట్లు	శాతం
రాయదుర్గం	1,30,794	1,13,978	87.14	1,33,516	1,13,253	84.82
ఉరవకొండ	1,10,540	96,241	87.06	1,13,771	96,182	84.53
గుంతకల్లు	1,32,943	1,01,539	76.37	1,37,630	1,02,251	74.29
తాడిపత్రి	1,23,496	1,02,898	83.32	1,25,358	1,03,792	82.79
శింగనమల	1,22,927	1,03,438	84.14	1,24,417	1,01,610	81.66
అనంతపురం అర్బన్	1,37,708	89,188	64.76	1,43,479	93,825	65.39
కళ్యాణదుర్గం	1,14,356	1,02,905	89.98	1,16,422	1,02,235	87.81
రాప్తాడు	1,25,028	1,07,349	85.85	1,25,531	1,05,856	84.32
మొత్తం	**9,97,792**	**8,17,536**	**81.93**	**10,20,124**	**8,19,004**	**80.28**

కూటమిదే అధికారం

జిల్లాలో వైసీపీ, టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ఓటింగ్ సరళి వైసీపీ అభ్యర్థులను కలవరపెడుతోంది. ఓటు హక్కు వినియోగించుకోవడంలో యువత చైతన్యం చూపడం, ఇదివరకూ ఓటు వేయని ఉన్నత వర్గాలు సైతం పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టడం దీనికి కారణం. మరోవైపు ఉద్యోగవర్గాల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత వైసీపీవారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఈవీఎంలలో వారి కుటుంబాల ఓట్లు అధిక శాతం కూటమికే పోలయ్యాయని భావిస్తున్నారు. సూపర్‌సిక్స్ పథకాల ప్రభావం, ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన, జిల్లాలోని ఆ పార్టీ ప్రజాప్రతినిధుల అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు వెరసి.. కూటమి అభ్యర్థుల ఘన విజయం తథ్యమని అంటున్నారు. రాష్ట్రంలో కూటమిదే అధికారమనే చర్చ జోరుగా సాగుతోంది. జిల్లాలో మెజార్టీ నియోజకవర్గాలు కూటమికే దక్కే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. పోటెత్తిన ఓటర్ల నాడి అధికార వైసీపీ వైపా... కూటమి వైపా అన్నది కౌంటింగ్ రోజున తేలనుంది. అంత వరకూ ఉత్కంఠ కొనసాగుతుంది.



కలెక్టరు పర్యవేక్షణలో
అభ్యర్థుల సమక్షంలో సీల్
జేఎన్‌టీయులో మూడంచెల భద్రత
కౌంటింగ్ ముగిసే వరకు నిఘా కొనసాగింపు

స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలు



అనంతపురం టౌన్, మే 14: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం రాత్రి దాదాపు 11 గంటల సమయంలో ముగిసింది. ఓటర్లు పెద్దఎత్తున తరలి రావడం, కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యమైంది. జిల్లా వ్యాప్తంగా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలలో వినియోగించిన ఈవీఎంలను పటిష్ట భద్రత నడుమ అనంతపురం నగరలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. ఈవీఎంలను జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకులు మనీష్ సింగ్, రవికుమార్, అజయ్‌నాథ్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్ పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈ ప్రక్రియ సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 2,670, పార్లమెంటుకు 2,322 కంట్రోల్ యూనిట్లు వినియోగించారు. అసెంబ్లీ స్థానాలకు 3,001, పార్లమెంటు స్థానానికి 4,686 బ్యాలెట్‌యూనిట్లు వినియోగించారు. వీవీ ప్యాట్లు అసెంబ్లీ స్థానాలకు 3000, పార్లమెంటు స్థానానికి 2,595 వినియోగించారు. వీటన్నింటినీ స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. అభ్యర్థుల సమక్షంలోనే ఈవీఎంలను నియోజకవర్గాల వారీగా భద్రపరిచి.. ఆ గదులను సీజ్ చేయించారు.

● మూడంచెల భద్రత

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల పోలింగ్‌కు ఉపయోగించిన ఈవీఎంలను జేఎన్‌టీయు కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. స్ట్రాంగ్ రూంలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధలన మేరకు ఈవీఎంల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. అన్ని పార్టీల అభ్యర్థుల సమక్షంలోనే భద్ర కల్పించామని అన్నారు. జూన్ నాలుగో తేదీన కౌంటింగ్ జరుగుతుందని అప్పటి వరకు స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల పోలీస్ భద్రత, ప్రత్యేక సీసీ కెమెరాల నిఘా కొనసాతుందని అన్నారు.

● తాడిపత్రి అల్లర్లపై చర్యలు తీసుకుంటాం : కలెక్టరు

జిల్లాలో వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగిందని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. అక్కడక్కడ చెదురు మదురు ఘటనలు జరిగినా, పోలింగ్‌కు ఎక్కడా అంతరాయం కలగలేదని అన్నారు. తాడిపత్రిలో జరిగిన అల్లర్లలో ఎన్నికల కమిషన్ నిబంధనల ఉల్లంఘన జరిగిందని అన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల లోపే అల్లర్లు జరిగాయని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.



స్ట్రాంగ్‌రూమ్‌లలో ఈవీఎంల రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టరు వినోద్ కుమార్



స్ట్రాంగ్ రూమ్‌ల సీల్‌పై సంతకం చేస్తున్న కలెక్టరు వినోద్ కుమార్

స్ట్రాంగ్ రూం భద్రతను పరిశీలించిన

కూటమి అభ్యర్థులు

అనంతపురం అర్బన్, మే 14 : జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ పరిశీలించారు. అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న తదితర ముఖ్యనాయకులతో కలిసి వారు స్ట్రాంగ్ రూంలను, ఈవీఎంల సీలింగ్‌ను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్ల గురించి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్‌తో వారు చర్చించారు. సర్వైలెన్స్ నిఘా నిత్యం ఉంటుందని వారికి జిల్లా ఎన్నికల అధికారి వివరించారు.

గెలుపు ఖాయం: అంబికా

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయమని ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వాలు ఏర్పాటు అవుతాయని అన్నారు. ఎంపీగా తన విజయం ఖాయమని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

● నామినేషన్ దాఖలు మొదలు పోలింగ్ వరకూ తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో తాము విజయం సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. మరో 20 రోజుల్లో మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోబోతున్నామని అన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించిన ఎన్నికల అధికారులు, పోలీసులు, సిబ్బందికి ఆయన ధన్యావాదాలు తెలిపారు.






స్ట్రాంగ్ రూం సీలుపై సంతకం చేస్తున్న దగ్గుపాటి ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణ

తాడిపత్రిలో రాళ్లవర్షం

టీడీపీ నాయకుడి ఇంటిపై దాడి
రెచ్చిపోయిన వైసీపీ వర్గీయులు
చేతులెత్తేసి.. చేష్టలుడిగి.. పోలీసులు
సీఐకి గాయాలు.. పోలీసు వాహనం ధ్వంసం.. ఆంధ్రజ్యోతి ముందేచెప్పినా...



కాలేజ్ గ్రౌండ్‌లో..

పోలింగ్ రోజున మొదలు పెట్టిన దాడులను ఎమ్మెల్యే పెద్దారెడ్డి వర్గీయులు రెండోరోజు కొనసాగించారు. టీడీపీ నాయకుడి సూర్యముని ఇంటివద్ద మొదలుపెట్టి.. జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటివరకూ కొనసాగించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకూ విడతలవారీగా విరుచుకుపడ్డారు. రాళ్ల వర్షం కురిపిస్తూ స్వైర విహారం చేశారు. ఈ దాడుల్లో సీఐ మురళీకృష్ణ గాయపడ్డారు. పోలీసుల వాహనం ధ్వంసమైంది. తాడిపత్రిలో పరిస్థితి ఇలాగే ఉంటుందని.. భారీ భద్రత అవసరమని ఆంధ్రజ్యోతి ముందుగానే చెప్పింది. 'శాంతి భద్రమేనా..?' 'ఎన్నికలు ప్రశాంతంగా జరిగేనా..?' అని సందేహాలు వ్యక్తం చేసింది. సిబ్బంది కొరతను ఎత్తి చూపింది. అయినా పోలీసు శాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహించారు. గతానుభవాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఫలితంగా తాడిపత్రిలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి. (వివరాలు 7లో)



ధ్వంసమైన పోలీస్ జీపు



టెన్షన్ లేదు..!

కుటుంబసభ్యులు.. శ్రేణులతో పరిటాల సునీత

అనంతపురం అర్బన్, మే 14 : ఎన్నికల్లో అందరూ బాగా పని చేశారని, గెలవబోతున్నామని మాజీ మంత్రి పరిటాల సునీత ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల కారణంగా ఇన్నాళ్లూ తీరిక లేకుండా గడిపిన ఆమె.. పోలింగ్ ముగియడంతో కనగానపల్లి మండలం నరసంపల్లి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నాయకులతో సమావేశమయ్యారు. కాసేపు పొలాలను పరిశీలించారు. అనంతరం రామగిరి మండలం వెంకటాపురంలోని తన నివాసంలో నాయకులతో సమావేశమయ్యారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, తెలుగు మహిళలతో సమావేశమయ్యారు. గ్రామాల వారిగా పోలింగ్ తీరు.. ఎక్కడెక్కడ ఎంత పోలింగ్ నమోదైంది.. తనకు ఎన్ని ఓట్లు పడ్డాయి..? మెజార్టీ ఏ మేరకు రావచ్చని ఆరా తీశారు. ఇక నుంచి మనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. అనంతపురం నగరంలోని తన నివాసంలో తన మనువడు పరిటాల రవీంద్ర, మనువరాలు అమైరా రవీంద్రతో కాసేపు సరదాగా గడిపారు.

పోలింగ్ సరళిపై చర్చలు

అనంతపురం అర్బన్, మే 14 : ఎన్నికల ప్రచారంలో ఎండను లెక్క చేయకుండా కూటమి అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ఇంటింటికీ తిరిగారు. పోలింగ్ ముగిడంతో మంగళవారం సాయంత్రం తన నివాసంలో సతీమణి శ్రీలక్ష్మీ, కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి పోలింగ్ సరళిపై చర్చించారు. పోలింగ్ కేంద్రాల వారిగా పోలైన ఓట్ల వివరాలను పరిశీలించారు. అందులో తనకు ఎన్ని ఓట్లు పోలై ఉంటాయి..? ఏఏ పోలింగ్ కేంద్రాల పరిధిల్లో మెజార్టీ రావచ్చు అని ఆరా తీశారు. పోలింగ్ ఏజెంట్లు, నాయకులతో చర్చించారు.



పార్టీ నాయకులతో దగ్గుపాటి చర్చలు

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.5

పాఠకుని పూర్తి పేరు : ....

దోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. అనంతపురం అర్బన్				
2. రాప్తాడు				
3. శింగనమల				
4. తాడిపత్రి				
5. గుంతకల్లు				
6. ఉరవకొండ				
7. కళ్యాణదుర్గం				
8. రాయదుర్గం				
9. ధర్మవరం				
10. కదిరి				
11. పుట్టపర్తి				
12. పెనుకొండ				
13. హిందూపురం				
14. మడకశిర				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 239-2ఎ, బెంగళూరు బైపాస్, కక్కలపల్లి క్రాస్, అనంతపురము- 515001.

షరతులు వర్తిస్తాయి



సూర్యముని ఇంటివద్ద వైసీపీ వర్గీయులు

యుద్ధభూమి.. తాడిపత్రి



గాయపడ్డ సీఐ మురళీకృష్ణ

రెండోరోజు కొనసాగిన వైసీపీ గూండాగిరి

- టీడీపీ నాయకుడు సూర్యముని ఇంటిపై దాడి
- టీడీపీ శ్రేణుల ఎదురుదాడితో రణరంగం
- పట్టణ సీఐకి గాయాలు..
- పోలీసు వాహనాలు ధ్వంసం
- జేసీ ప్రభాకర్.. పెద్దారెడ్డి ఇళ్ల వద్ద మరోమారు దాడులు
- గంటలు గడిచినా అదుపులోకి రాని పరిస్థితి
- చేతులెత్తేసి.. చోద్యం చూసిన పోలీసులు
- ఆందోళనకు దిగిన జేసీ ప్రభాకర్..
- అడ్డుకున్న పోలీసులు
- ఫిర్యాదు తీసుకోకుండా.. పట్టణ పోలీస్ స్టేషన్‌కు తాళం





గాయపడ్డ టీడీపీ కార్యకర్త గంగాధర్

తాడిపత్రి టౌన్, మే 14: అనంతపురం జిల్లా తాడిపత్రిలో వైసీపీ హింస కొనసాగుతోంది. పోలింగ్ రోజున సోమవారం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వీరంగం సృష్టించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన అనుచరవర్గం దాడులకు పాల్పడింది. తాడిపత్రిలో ఏకంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన తనయులు, అనుచరులు టీడీపీ కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వాహనాలను ధ్వంసం చేశారు. రెండో రోజు మంగళవారం మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి మరింత రెచ్చిపోయారు. రాత్రి 9 గంటల వరకు యథేచ్ఛగా దాడులు కొనసాగించారు. దీంతో తాడిపత్రి రణరంగంగా మారింది.

సూర్యముని ఇంటిపై దాడి..

తాడిపత్రి పట్టణంలోని గానుగవీధిలో టీడీపీ సీనియర్ నాయకుడు సూర్యముని ఇంటిపై వైసీపీ అల్లరి మూకలు మంగళవారం మధ్యాహ్నం రాళ్ల వర్షం కురిపించాయి. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నాయి. అక్కడ ఇరువర్గాలు పెద్దఎత్తున రాళ్లు రువ్వుకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలను చెల్లాచెదురు చేయడానికి ఎంత ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. వైసీపీ వర్గీయుల రాళ్లదాడిలో పట్టణ సీఐ మురళీకృష్ణ తలకు గాయమైంది. సీఐ, ఎస్ఐ వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బాష్పవాయువును ప్రయోగించారు. దీంతో పరిస్థితి కొద్దిసేపు అదుపులోకి వచ్చింది. సూర్యముని ఇంటిపై దాడి గురించి తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పెద్దఎత్తున అనుచరులతో కలిసి ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆయన వస్తే పరిస్థితి చేయి దాటుతుందని గమనించిన పోలీసులు అడ్డుకున్నారు. తమ పార్టీ నాయకుడిని పరామర్శించేందుకు వెళుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. శాంతిభద్రతల దృష్ట్యా వెనుదిరగాలని అడిషనల్ ఎస్పీ సూచించారు.



పెద్దారెడ్డి ఇంటిపైనుంచి టీడీపీ వర్గీయులపై రాళ్లు రువ్వుతున్న దృశ్యం

పోలీసుల అభ్యర్థనతో..

శాంతిభద్రతల దృష్ట్యా పోలీసుల అభ్యర్థన మేరకు సూర్యముని ఇంటివద్ద నుంచి చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులతో కలిసి వెనుదిరిగారు. అక్కడి నుంచి ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ అల్లరిమూకలపై ఫిర్యాదు చేయడానికి బయలుదేరారు. సమాచారం అందుకున్న పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తాళం వేశారు. గేటు తీయాలని, ఫిర్యాదు చేసి వెళతానని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎంత చెప్పినా పోలీసులు వినలేదు. ఎంతసేపటికి తాళాలు తీయకపోవడంతో ఆయన శాంతియుతంగా ధర్నా చేసేందుకు అనుచరవర్గంతో కలిసి గాంధీసర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ చైర్ వేసుకొని కూర్చొని నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు కాకర్ల రంగనాథ్, జగదీశ్వరరెడ్డి అనుచరులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పెద్దఎత్తున గాంధీసర్కిల్‌కు చేరుకొని ధర్నాలో పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీతో పాటు డీఎస్పీ గంగయ్య, సిబ్బంది గాంధీసర్కిల్‌కు చేరుకుని ధర్నా విరమించి వెళ్లిపోవాలని జేసీ ప్రభాకర్ రెడ్డిని హెచ్చరించారు. దీంతో శాంతియుతంగా ధర్నా చేసే హక్కు కూడా లేదా అంటూ ఆయన పోలీసులపై మండిపడ్డారు. శాంతిభద్రతలకు ఇబ్బంది కలుగుతుందని, వెంటనే ఖాళీ చేయాలని సూచించడంతో ఆయన అనుచరులతో కలిసి సీబీ రోడ్డు మీదుగా నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. కానీ వైఎస్సార్ సర్కిల్ దాటగానే మరోసారి పోలీసులు అడ్డుకున్నారు. కోడ్ అమలులో ఉందని, భారీ జనాలతో వెళ్లరాదని, వాహనంలో వెళ్లిపోవాలని అడిషనల్ ఎస్పీ సూచించారు. చేసేదేమిలేక ఆయన వాహనం ఎక్కి వైఎస్ సర్కిల్, గాంధీసర్కిల్, పుట్లూరురోడ్డు, సంజీవనగర్ మీదుగా తన నివాసానికి చేరుకున్నారు. పరిసర మండలాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో జేసీ ప్రభాకర్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు.



ధ్వంసమైన పోలీసు జీపు

ఇరువర్గాలపై కేసు నమోదు

పోలింగ్ రోజున ఓంశాంతినగర్‌లో చోటుచేసుకున్న రాళ్లదాడులకు సంబంధించి ఇరువర్గాల నాయకులపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, టీడీపీ నేత జేసీ పవన్‌రెడ్డితోపాటు సుమారు వంద మందిపై కేసులు నమోదుచేశారు. జేసీ అశ్మిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డి, మరికొందరు వైసీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు.



సూర్యమునిని పరామర్శిస్తున్న జేసీపీఆర్



గాంధీసర్కిల్‌లో జేసీపీఆర్ ఆందోళన

మరోసారి వైసీపీ దాడులు..

టీడీపీ శ్రేణులు పట్టణానికి పెద్దఎత్తున వచ్చాయని తెలుసుకున్న వైసీపీ అల్లరిమూకలు మరోసారి రెచ్చిపోయాయి. జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇళ్లకు మధ్యలో జూనియర్ కళాశాల మైదానం ఉంది. ఇరువర్గాల వారు ఈ మైదానాన్ని దాడులకు వేదికగా చేసుకొని దాదాపు గంటలపాటు రాళ్లు రువ్వుకున్నారు. పెద్దారెడ్డి ఇంటిపై నుంచి వైసీపీ వర్గీయులు రాళ్లు విసురుతుండడంతో టీడీపీ కార్యకర్తలు పరుగులు తీశారు.

దీపావళి 'రాకెట్' దాడులు..

టీడీపీ శ్రేణులను భయపెట్టడానికి వైసీపీ వర్గీయులు దీపావళిరోజున పేల్చే రాకెట్లను ప్రయోగించారు. దూరం నుంచి చూసేవారికి కాలేజీ మైదానంలో పేలుళ్లు జరుగుతున్నట్లు భ్రమ కలిగింది. ఏం జరుగుతుందోనని టీడీపీ వర్గీయులు భయభ్రాంతులకు గురయ్యారు. బాణ సంచా అని తెలుసుకుని.. వారు కూడా అదే తరహాలో పెద్దారెడ్డి ఇంటివైపునకు రాకెట్లను వదిలారు.

ట్రాక్టర్లలో రాళ్లు..

మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసం వద్దకు పెద్దఎత్తున అనుచరులు చేరుకున్నారన్న విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు ముందస్తుగా ట్రాక్టర్లతో రాళ్లను సిద్ధం చేసుకున్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటివద్దకు అనుచరులు భారీ చేరుకొన్నారు. అక్కడ ఇరువర్గాలు పరస్పర రాళ్లదాడులకు దిగారు. మరోసారి పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. జూనియర్ కళాశాల మైదానంలో కూడా టీడీపీ, వైసీపీ వర్గీయులు పెద్దఎత్తున రాళ్లు రువ్వుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. పోలీసు సిబ్బంది తక్కువగా ఉండడంతో పరిస్థితి గంటలు దాటినా అదుపులోకి రాలేదు. చివరికి సీఆర్‌పీఎఫ్ బలగాలు తాడిపత్రికి చేరుకున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పురాలేదు. రాత్రి 9 గంటలైనా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

చేతులెత్తేసిన పోలీసులు

దాదాపు ఐదు గంటలపాటు శ్రమించినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో పోలీసులు చేతులెత్తేశారు. ఎంతో సమస్యాత్మకమైన తాడిపత్రిలో పోలీసు అధికారుల ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే పరిస్థితి ఇలా తయారైంది. తగినంత భద్రతకు పోలీసు సిబ్బందిని మోహరించాల్సిన అధికారులు ఏమీపట్టనట్లు వ్యవహరించారు. ఓంశాంతినగర్, పాతకోటలో రాళ్లదాడి జరుగుతుంటే పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పోలీసులు తమ వాహనంలో నింపాదిగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, రక్షణ కవచాలు తీసుకుని బయలుదేరారు. బందోబస్తు విషయంలో నిర్లక్ష్యం వహించారు. మైదానంలో ఇరువర్గాలు తలపడుతున్నా పోలీసులు నిలబడి చోద్యం చూశారు. పోలింగ్ ముగియడంతో ప్రశాంతంగా ఉండొచ్చని భావించిన తాడిపత్రి ప్రజలు మంగళవారం జరిగిన ఘటనతో భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు పట్టణంలో వ్యాపార సముదాయాలను మూసివేయించారు.

పోలీసుల అదుపులో పెద్దారెడ్డి

తాడిపత్రిలో రెండురోజుల నుంచి జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసానికి ఎస్పీ అమిత్ బర్దర్, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ గంగయ్య వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఆయనను ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లారు. ఎక్కడికి అనే సమాచారాన్ని బహిర్గతం చేయలేదు.

వైసీపీ గూండాల దాడులు హేయం

తాడిపత్రి ఘటనలను ఖండించిన టీడీపీ నాయకులు

దాడులు హేయం: కాలవ



అనంతపురం అర్బన్, మే 14: తాడిపత్రిలో టీడీపీ నాయకుడు సూర్యముని ఇంటిపై వైసీపీ గూండాలు రాళ్ల దాడులకు పాల్పడటం హేయమని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఒక ప్రకటనలో మండిపడ్డారు. తాడిపత్రి పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ గూండాలు దాడులకు దిగుతున్నా పోలీసులు కేతిరెడ్డి పెద్దారెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే వైసీపీ అల్లరి మూకలు టీడీపీ నాయకులపై భౌతిక దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. తాడిపత్రిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఎమ్మెల్యేతోపాటు వైసీపీ గుండాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటమి భయంతోనే..

- వెంకటశివుడు యాదవ్



తాడిపత్రిలో ఓటమి భయంతోనే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తమ పార్టీ నాయకులపై దాడులు చేయిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. పోలింగ్ రోజునే పెద్దారెడ్డి తన అనుచరులతో టీడీపీ నాయకులపై రాళ్ల దాడి చేయించారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పోలీసు యంత్రాంగం తాడిపత్రిలో పటిష్ట భద్రత కల్పించే ఉంటే రెండో రోజు ఈ దాడులు జరిగేవి కాదన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు సూర్యముని ఇంటిపై రాళ్ల దాడి చేయడం దారుణమన్నారు. వైసీపీ పాలనలో బీసీలను టార్గెట్‌గా చేసుకొని దాడులకు తెగబడుతున్నారనేందుకు సూర్యముని ఇంటిపై రాళ్ల దాడే నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డిని టార్గెగా చేసుకొని ఆయన ఇంటిపైనా రాళ్ల దాడులకు తెగబడటం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రిలో శాంతి భద్రతలకు విఘాతం కలించాడని, ఎన్నికల సంఘం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. దాడులకు పాల్పడిన ఎమ్మెల్యేతోపాటు వైసీపీ అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడులు సిగ్గుచేటు: అంబికా



తాడిపత్రిలో టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన అనుచరులు దాడులకు పాల్పడటం సిగ్గుచేటని అనంతపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో జీర్ణించుకోలేక టీడీపీ నాయకులపై దాడులకు తెగబడుతున్నారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన బోయ సూర్యముని ఇంటిపై రాళ్ల దాడికి పాల్పడం హేయమన్నారు. తాడిపత్రిలో టీడీపీ నాయకులపై దాడులకు కారణమైన ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వైసీపీ అల్లరి మూకలను అరెస్టు చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాడిపత్రితోపాటు కళ్యాణదుర్గం, పుట్లూరు, ఇతర ప్రాంతాల్లో వైసీపీ అల్లరి మూకలు టీడీపీ నాయకులపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయన్నారు. పోలింగ్ ముగిసిన ఒక రోజుకే వైసీపీ అరాచకాలు ఇలా ఉంటే.. ఓట్ల లెక్కింపు సమయంలో ఇంకా ఎంతగా బరిగెతిస్తారో అర్థమవుతోందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు ఉన్నతాధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

గుంతకల్లు క్రూ లాబీ వద్ద లోకోపైలెట్ల ధర్నా



క్రూకంట్రోల్ లాబీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

గుంతకల్లు, మే14: వేరే డివిజన్లలో చిన్న చిన్న (సైడింగ్) స్టేషన్ల వద్ద ఉన్న ఫ్యాక్టరీల్లో ఉద్యోగులను పంపి పనిచేయించడానికి యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకోవడం అన్యాయమని రైల్వే లోకో పైలెట్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక క్రూ కంట్రోల్ లాబీ వద్ద లోకో పైలెట్లు నేలపైన కూర్చుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే వివిధ పనుల కారణంగా లోకో రన్నింగ్ స్టాఫ్ ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. ఇటువంటి నిర్ణయాలతో ఉద్యోగులు మరింత ఒత్తిళ్లకు లోనౌతారని, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ఎం బాషా, నాయకులు నరేశ్, దివాకర్, లోకో రన్నింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు వన్‌టైం నోటిఫికేషన్

1994-2014 మధ్య పాస్‌కాని వారికి అవకాశం

అనంతపురం సెంట్రల్, మే 14: ఎస్కేయూ ఆధ్వర్యంలో డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఒక్కసారి అవకాశం పేరుతో నోటిఫికేషన్ విడుదల చేశామని పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 1994-95 నుంచి 2014-15వరకు డిగ్రీలో ఫెయిలయిన విద్యార్థులందరూ అర్హులని పేర్కొన్నారు. జూన్ 14వరకు పరీక్షా ఫీజు చెల్లింపు గడువు విధించామన్నారు. ఫీజు చలానా, నామినల్ రోల్స్‌తోపాటు దరఖాస్తు కాపీలను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు జూన్ 18లోపు ఎస్కేయూ పరీక్షల విభాగంలో సమర్పించాలని సూచించారు. రూ.1000 ఫైన్‌తో జూన్ 21వరకు, రూ.3వేల ఫైన్‌తో 28లోపు చెల్లించ వచ్చన్నారు. పరీక్షల నిర్వహణ తేదీ ముందురోజు వరకు ఫీజుతోపాటు రూ.5వేల ఫైన్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక సబ్జెక్టుకు రూ.2వేలు, రెండు సబ్జెక్టులకు రూ.3వేలు. మూడు నుంచి ఆపై ఎన్ని సబ్జెక్టులున్నా రూ.4వేల ఫీజును నిర్ధారించామని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి తృతీయ సంవత్సరం కళాశాలను వీడిన విద్యార్థులు రూ.3వేల ఫైన్‌తో పరీక్షల ఫీజు కట్టవచ్చు అన్నారు. కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ఎస్కేయూ ఆధ్వర్యంలో డిగ్రీ చేసిన విద్యార్థులున్నారని, వారందకీ వన్ టైం చాన్స్ పేరుతో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పరీక్షలు, ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఎప్పుడు నిర్వహించేది టైంటేబుల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని అనంతపురం కేఎస్ఎన్ మహిళా ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు **www.skuniversity.ac.in** వెబ్‌సైట్‌ను సందర్శించాలని వారు సూచించారు.

పేద బ్రాహ్మణ విద్యార్థినులకు ఉపకారవేతనాలు

అనంతపురం క్లాక్‌టవర్: పేద బ్రాహ్మణ విద్యార్థినులకు ప్రతి ఏటా అందజేసే ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ విద్యార్థిని మహిళా సంక్షేమ సంఘం కార్యదర్శి రమాదేవి తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆరోతరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న పేద బ్రాహ్మణ బాలికలు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9703789201, 9490130999ను సంప్రదించాలని తెలిపారు.

అంతటా ఉత్కంఠ..!

భారీ పోలింగ్‌పై చర్చలే చర్చలు

ఓటింగ్ సరళిపై అభ్యర్థుల సమీక్షలు

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

పుట్టపర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): 'అన్నా.. నియోజకవర్గంలో పరిస్థితి ఏంది? ఎవరు గెలుస్తారు? ఏ మండలంలో ఎవరికి మెజార్టీ వస్తుంది? పోలింగ్ శాతం భారీగా పెరగడం ఎవరికి మేలు చూకూరుస్తుందంటావ్? రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది?' సర్వత్రా ప్రస్తుతం ఇవే చర్చలు. అంతటా ఒకటే ఉత్కంఠ. ఎవరు ఫోన్ చేసినా.. ఎక్కడు ఇద్దరు కలిసినా ఇవే చర్చోపచర్చలు వినిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ముగియడంతో గెలుపోటములపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గెలుపోటములపై అభ్యర్థులు లెక్కలేసుకుంటున్నారు. ఏ గ్రామంలో, ఏ పోలింగ్ బూత్‌లో ఎన్ని ఓట్లు వచ్చాయి, ఎక్కడ మెజార్టీ ఉంది, ఎక్కడ తక్కువగా వస్తుందన్న అంశాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగిన సంగతి తెలిసిందే. పోలింగ్ ముగియడంతో మంగళవారం ఆయా నియోజకవర్గాల్లో కూటమి, వైసీపీ అభ్యర్థులు పోలింగ్ బూత్‌లవారీగా నాయకులను పిలిపించుకుని, పోలింగ్ సరళిని ఆరా తీశారు. జిల్లావ్యాప్తంగా 84.82శాతం పోలింగ్ నమోదు కాగా.. అత్యధికంగా ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 88.82 శాతం, అత్యల్పంగా హిందూపురంలో 77.81 శాతం నమోదైంది. రాప్తాడు, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో 80 శాతంపైగా పోలింగ్ నమోదైంది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై అభ్యర్థులు సమీక్షలు జరిపారు. పంపిణీ చేసిన నోటు, మద్యం, తాయిలాలు ఓటరుకు ఎలా చేరాయి? వారి మనోగతం ఎలా ఉంది? ఏ పార్టీకి ఓటేశారు అనే అంశాలపై సామాజిక వర్గాలుగా లెక్కలేశారు. గత ఎన్నికల కంటే భిన్నంగా ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ పరిణామం కూటమికి అనుకూలమన్న చర్చ సాగుతోంది. మహిళలు, యువత ఓటెత్తడం చర్చనీయాంశమైంది.



అన్నా.. ఎవరు గెలుస్తారు..?

ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు? రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందన్న విషయాలపై మంగళవారం జిల్లా అంతటా చర్చలు సాగాయి. ఏ ఇద్దరు కలిసినా ఇదే చర్చ వినిపించింది. ఎన్నికల్లో అధికార పార్టీ నోటు, మద్యం వెదజల్లింది. ఒక్కో అభ్యర్థికి రూ.30 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు అంచనా. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పోలింగ్ రోజు వరకు ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. ఇంత ఖర్చు చేసినా.. పోలింగ్ సరళి అధికార పార్టీ వర్గాల్లో కలవరం రేపుతోంది. భారీగా పోలింగ్ నమోదవడం ప్రభుత్వ వ్యతిరేకతేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ, ఉపాధి కల్పనలో ప్రభుత్వ వైఫల్యం పట్ల ఆగ్రహంగా ఉన్న యువత ఓటుకు పోటెత్తారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మహిళలు భారీగా తరలిరావడం ఎవరికి లాభదాయకమన్న చర్చలు సాగుతున్నాయి. ఏదిఏమైనా ఓటరు నాడి పట్టేందుకు పోలింగ్ కేంద్రాల వారీగా ఆయా గ్రామాల నాయకుల ద్వారా సమాచారం తెప్పించుకుంటున్నారు. గెలుపుపై ఎవరి ధీమా వారిదే అన్నట్లు కనిపిస్తోంది.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ వర్గీయులు

కళ్యాణదుర్గం రూరల్, మే 14: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు మంగళవారం దాడి చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం టీడీపీ, వైసీపీ నాయకులు దాడులు, ప్రతి దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో గాయపడ్డ టీడీపీ కార్యకర్తలు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అంతటితో ఆగని వైసీపీ రౌడీ మూకలు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చొరబడి చికిత్స పొందుతున్న మహిళలపై దాడులకు తెగబడ్డారు. చెప్పులతో కొట్టి, తాళిబొట్లు తెంచినట్లు బాధిత మహిళలు ఆరోపించారు. దాడిలో గాయపడ్డ అనసూయమ్మను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ముగ్గురు కార్యకర్తలు నరసింహులు, జ్యోతి, లలితమ్మ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొలిమిపాళ్యంలో తెల్లవారుజాము వరకు పోలింగ్



మంగళవారం తెల్లవారుజాము వరకు క్యూ లైన్‌లో వేచి ఉన్న ఓటర్లు

కుందుర్పి, మే 14 : మండల పరిధిలోని కొలిమిపాళ్యంలో మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. దీంతో ఓటర్లు క్యూ లైన్‌లో ఉంటూ, అక్కడే నిద్రిస్తూ ఓపిగ్గా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈవీఎంలు 12 గంటలకు వరకే పనిచేసి, ఆగిపోయే పరిస్థితి ఉండడంతో ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని అక్కడున్న పోలింగ్ సిబ్బంది సమాచారం అందించారు. ఆర్డీవో రాణిసుస్మిత, డీఎస్పీ శ్రీనివాసులు, తహశీల్దారు హనుమంతు అక్కడికి చేరుకుని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మరో ఈవీఎంను ఉపయోగించి, తెల్లవారుజామున 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. 1201 ఓటర్లు ఉండగా.. 1086 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 92 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా మండల పరిధిలోని అపిలేపల్లి, తెనగల్లు, బెస్తరపల్లి కొన్ని గ్రామాల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు పోలింగ్ సాగింది.

స్ట్రాంగ్ రూముల్లో భవిత భద్రం

జేఎన్‌యూటీలో సోమవారం రాత్రంతా విధుల్లో సిబ్బంది

అనంతపురం టౌన్, మే 14 : జిల్లాలో ఓటింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాట్లను జిల్లాకేంద్రంలోని జేఎన్‌టీయులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు సోమవారం రాత్రి తరలించారు. అధికారుల లెక్కల మేరకు ఈ ఎన్నికలలో జిల్లాలో కంట్రోల్ యూనిట్లు ఎనిమిది అసెంబ్లీలకు కలిపి 2,670, పార్లమెంటుకు 2,322 కంట్రోల్ యూనిట్లు, అలాగే అసెంబ్లీలకు 3,001, పార్లమెంటుకు 4,686 బ్యాలెట్ యూనిట్లు, అలాగే అసెంబ్లీలకు 3000, పార్లమెంటుకు 2,595 వీవీ ప్యాట్లు వినియోగించారు. సోమవారం ఎన్నికలు ముగిసిన తర్వాత పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన ప్రత్యేక వాహనాలలో పోలీస్ బందోబస్తు మధ్య జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ స్ట్రాంగ్‌రూమ్స్‌కు తీసుకొచ్చారు. సోమవారం అర్ధరాత్రి దాటినా ఈవీఎంల స్వాధీనం, స్ట్రాంగ్‌రూమ్స్‌లలో భద్రపరచడం కొనసాగింది. ఇక్కడ కలెక్టరు వినోద్‌కుమార్, పరిశీలకులు ఐఏఎస్ మనీష్‌సింగ్, ఐపీఎస్ రవికుమార్ పర్యవేక్షణలో స్ట్రాంగ్‌రూమ్స్‌కు తరలించి భద్ర పరిచారు. సీసీ కెమెరాల నిఘాలో ఎస్పీ అమిత్‌బర్దర్ నేతృత్వంలో ప్రత్యేక బలగాలతో భద్రత చేపట్టారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు కౌంటింగ్ వచ్చే నెల 4న చేపట్టనున్నారు.



సోమవారం అర్ధరాత్రి విధుల్లో ఎన్నికల సిబ్బంది

ట్రాఫిక్‌జామ్ ... సిబ్బంది అవస్థలు

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల పోలింగ్ నిర్వహించిన ఈవీఎంలు రాత్రి కల్లా జేఎన్‌టీయులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు ప్రత్యేక వాహనాలలో తీసుకొచ్చారు. రాత్రి 7-30 గంటల నుంచి వాహనాలు అక్కడికి చేరుకుంటూ వచ్చాయి. ఎనిమిది నియోజకవర్గాలకు చెందిన వాహనాలు మొత్తం అక్కడకు చేరుకోవడంతో జేఎన్‌టీయూ రోడ్డు ట్రాఫిక్ జామ్ అయింది. పోలింగ్ సిబ్బంది లోపలికి వెళ్లి తమకు కేటాయించిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్దకు వెళ్లి ఈవీఎంలను స్వాధీనం చేయడానికి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రధానంగా దూరప్రాంతాల నుంచి ఇక్కడకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.





ఈవీఎంలు, వీవీ ప్యాట్లతో జేఎన్‌టీయూ చేరిన సిబ్బంది, ఎన్నికల సామగ్రిని అందజేసేందుకు సిబ్బంది నిరీక్షణ, సామగ్రిని అధికారులకు అందజేస్తున్న ఉద్యోగులు

రైతుల కష్టం అడవి పాలు..!

- ఎర్రచందనం విక్రయాల్లో 'అటవీశాఖ' చేతివాటం
- దళారుల అవతారం ఎత్తి సొమ్ము చేసుకొంటున్న అధికారులు
- వారు చెప్పిన వారికి.. చెప్పిన రేటుకే విక్రయించాలని హుకుం
- లేదంటే చెట్ల కట్టింగ్ అనుమతికి ముప్పుతిప్పలే
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు.. పట్టించుకోని డీఎఫ్‌ఓ



జిల్లా అటవీశాఖ జిల్లా కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, మే 14: జిల్లాలో ఎర్రచందనం విక్రయాల్లో అటవీశాఖ అధికారులే దళారుల అవతారం ఎత్తి... రైతులను దోచుకుంటున్నారనే విమర్శలు న్నాయి. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రైతులు తమ సొంత భూముల్లో ఎర్రచందనం చెట్లు పెంచారు. అయితే కొంత సైజు వచ్చిన తరువాత వాటిని కట్ చేసి.. అమ్ముకోవడానికి అటవీశాఖ అనుమతి తప్పనిసరి. అసలు సమస్య ఇక్కడే ప్రారంభం అవుతోంది. దీన్ని ఆసరగా తీసుకున్న కొందరు ఆ శాఖ సిబ్బంది కట్టింగు అనుమతి కోసం వచ్చిన రైతులకు దోచుకోంటున్నారు. వారు చెప్పిన వారికే ఎర్రచందనాన్ని విక్రయించాలని, కల్లర్ లేదని, ఇంతకంటే ఎక్కువ పోదని, తక్కువ రేటుకు విక్రయించకతప్పదని మాయమాటలు చెబు తున్నారు. అటు వ్యాపారుల వద్ద మాత్రం ఇలాంటి కట్టి మరి ఎక్కడ దొరకదని చెపి.. అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇలా రైతు వద్ద తక్కువ ధర చెప్పి.. వ్యాపారి వద్ద ఎక్కు వ ధర చెప్పి.. మధ్యలో సొమ్మును స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కొన్ని సంవత్సరాలుగా కష్టపడి పెంచిన ఎర్రచందనాన్ని అతి తక్కువ రేటుకు విక్రయించడానికి రైతులకు ఇష్టం లేకున్నా... చెట్ల కటింగ్‌కు అనుమతుల మంజూరుకు ఇబ్బందులు తలెత్తుతాయన్న ఉద్దేశంతో అధికారులు ఏది చెపితే దానికి వారు అంగీకరించాల్సి వస్తోంది. నూతన డీఎఫ్‌ఓ వినిత్ కుమార్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ దందా మరింత ఎక్కువైందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైన డీఎఫ్‌ఓ ఇలాంటి అక్రమాలకు పాల్పడె సిబ్బందిపై నిఘా ఉంచి తగిన చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

అటవీశాఖ సిబ్బంది ఎలాంటి అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవు. ఎర్రచందనం విక్రయాల్లో దళారుల అవతారం మా దృష్టికి రాలేదు. విచారణ చేస్తాం. అలాంటి సిబ్బంది ఎవరైన ఉన్నట్లు అయితే చర్యలు తీసుకుంటాం. ఏదైన సమస్య ఉంటే రైతులే నాకు స్వయంగా ఫిర్యాదు చేయవచ్చు.

- వినీత్ కుమార్, డీఎఫ్‌ఓ

ఆలయాన్ని పరిశీలించిన టీటీడీ పర్యవేక్షణ అధికారి

నార్పల, మే 14: మండలంలోని దుర్గంలో శ్రీ ఓబులేసు స్వామిదేవాలయాన్ని ధూపదీప నైవేద్యాల పథకం, టీటీడీ పర్యవేక్షణ అధికారి మోహనయ్య మంగళ వారం పరిశీలించారు. టీటీడీ ద్వారా ఆ ఆలయ అర్చకుడు మారుతికి సంభావన ఇస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరసింహులు, వైస్‌చైర్మన్ పెద్దన్న, సభ్యులు ఫక్కీరప్ప, కుళ్లాయప్ప, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో టీటీడీ పర్యవేక్షణ అధికారి మోహనయ్య

భక్తి శ్రద్ధలతో వాసవీమాత నగర సంకీర్తన



నగర సంకీర్తనలో వాసవీ భజన మండలి భక్తులు

అనంతపురం కల్చరల్, మే 14 : ఆర్యవైశ్యుల కుల దేవత వాసవీమాత నగర సంకీర్తన మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 18న నిర్వహించనున్న వాసవీ జయంతిని పురస్కరించుకుని ఐదు రోజుల నగర సంకీర్తనకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నగర సంకీర్తనను ప్రారంభించారు. పాతూరు అమ్మవారిశాల నుంచి ప్రారంభమైన ఈ సంకీర్తన విద్యుత్ కార్యాలయం, సున్నపువీధి, గాంధీ బజార్ మీదుగా తిరిగి అమ్మవారిశాల వరకు చేరుకుంది. అమ్మవారి చిత్రంపటంతో చేపట్టిన ఈ ఊరేగింపులో వాసవీ భజన మండలి సభ్యులు సర్వ దేవతల భజనలు, కీర్తనలు ఆలపించారు. వాసవీ భజన మండలి నిర్వాహకులు మాట్లాడుతూ 18వ తేదీవరకు ప్రతి రోజు ఉదయం 6.30 నుంచి 7.30 వరకు నిర్వహించే నగర సంకీర్తనలో భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. కొత్తూరు, పాతూరు అమ్మవారిశాలల్లో వాసవీ జయంతి నిర్వహణ కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్, ఆదినారాయణ, శ్రీనివాసులు, బాలాజీ, రమేష్, గుప్త, సురేంద్ర, చంద్రశేఖర్, వేణు రమేష్, సతీష్, కృష్ణమూర్తి, అప్పాజీ, మహేష్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



టాస్ వేస్తున్న మాంఛోఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, మే 14 : స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో అనంతపురం క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-2 పోటీలను మంగళవారం నిర్వహించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ మాంఛో ఫెర్రర్ టాస్ వేసి ఈ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... కరవు జిల్లాలో ఆంధ్రా, బీసీసీఐల సంయుక్త ఆధ్వర్యంలో ఏపీఎల్ పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు అవకాశం కల్పించి ప్రోత్సాహించడమే ఏపీఎల్ ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో యునైటెడ్ చాంపియన్స్ జట్టుపై ఇండియన్ సిక్సర్స్ జట్టు, అనంత రైజింగ్‌స్టార్స్ జట్టుపై గుత్తి జట్లు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, మధు ఆచారి, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఏడీసీఏ సహాయ కార్యదర్శి భీమలింగారెడ్డి, కోశాధికారి షబ్బీర్ అహ్మద్, బీసీసీఐ కోచ్ శ్రీనివాసరెడ్డి, మాజీ రంజీ క్రీడాకారుడు షాబుద్దీన్, చంద్రమోహన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కోగటం విజయబాస్కర్ రెడ్డి, కోచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

ఓటింగ్‌కు పోటీపడ్డారు..!

అనంతపురం రూరల్, మే 14: అనంతపురం రూరల్ మండలంలో ఓటు వేయడానికి స్త్రీ, పురుషులు పోటీ పడ్డారు. రాప్తాడు నియోజకవర్గం అనంతపురం రూరల్ మండలం పరిధిలోని 88 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో మొత్తం 81,415 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 63,156 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ఓటింగ్‌పై లెక్కలు..!

మండలంలోని గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు, గ్రామస్థులు సాధారణ ఎన్నికల పోలింగ్‌పై లెక్కలేసుకుంటున్నారు. ఏ గ్రామాల్లో ఆయా గ్రామాల పరిధిలోని ఓటర్లు ఎంత మంది ఉన్నారు... ఎంత మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో టీడీపీ, వైసీపీ వారు ఎంత మంది ఓటింగ్‌కు వచ్చారు. ఏ పార్టీ వారు ఎక్కువగా ఓటేశారు.. ఏ గ్రామంలో ఏ పార్టీ వారికి ఎక్కువ ఓట్లు పడ్డాయి.. ఎవరి ఎంత మెజార్టీ వస్తుంది... అంటూ లెక్కలేసుకుంటున్నారు.

చెన్నేకొత్తపల్లి : మండలంలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో 89.65 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం 37,233 ఓటర్లు ఉండగా 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో 33,381 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఇందులో 16,717 మంది పురుషులు, 16,664 మంది మహిళలు ఉన్నారని అధికారులు తెలిపారు.

రామగిరి : రామగిరి మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో 86.27శాతం నమోదైనట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం 29,396 ఓటర్లు ఉండగా ఇందులో 25,360 మంది తమఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఆత్మకూరు: మండలంలో 87 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 39 పోలిగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 33,227 మంది ఓటర్లు ఉండగా.. 29,023 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

శింగనమల : శింగనమల నియోజకవర్గంలో మొత్తంగా 83 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 293 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శింగనమల నియోజకవర్గంలో మొత్తం 2,47,373 మంది ఓటర్లు ఉండగా... వారిలో 2,05,068 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో 1,22,927 మంది పురుషులు, 1,24,417 మంది మహిళలు, ఇతరులు 29 మంది ఉన్నారు. గార్లదిన్నె మండలంలో 83 శాతం, శింగనమలలో 83.20 శాతం, బుక్కరాయసముద్రంలో 77.59 శాతం, నార్పలలో 83.97 శాతం, పుట్లూరులో 87.43 శాతం, యల్లనూరులో 80.74 శాతం ఓటింగ్ నమోదైంది.

గెలుపుపై బెట్టింగ్‌లు

నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ జరుగుతోంది. అభ్యర్థుల గెలుపు.. మెజార్టీ.. ఏ మండలంలో ఏ పార్టీ వస్తుంది... తదితర వాటిపై నార్పల, బుక్కరాయసముద్ర, గార్లదిన్నెలో జోరుగా బెట్టింగ్ జరుగుతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే పోలింగ్ శాతం పెరిగిందని టీడీపీ నాయకులు వాదిస్తున్నారు. అంతేకాకుండా టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు, వైసీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డల పద్మావతి, భర్త ఆలూరు సాంబశివారెడ్డి మీద ఉన్న వ్యతిరేకత... అభివృద్ధి చేయకపోవడం తమకు కలిసి వచ్చిందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఓట్లు కూడా తమకే పడ్డాయని చెబుతున్నారు. గతంలో టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఓడిపోవడంతో ఆ సానుభూతి కూడా తమకు కలిసివచ్చిందని అంటున్నారు.

రాప్తాడు నియోజకవర్గంలో

అనంతపురంరూరల్ : రాప్తాడు నిజయోకవర్గంలో మొత్తంగా 85.09 శాతం పోలింగ్ నమోదైంది. నియోజక వర్గంలో 279 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందులో 2,50,571 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,25,028 మంది పరుష లు, 1,25,531 మంది మహిళలు.. ఇతరులు 12 మంది ఉన్నారు. మొత్తంగా 2,13,207 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 1,07,349 మంది పురుషులు, 1,05,856 మంది మహిళలు, ఇతరులు ఇద్దరు ఓటింగ్ లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండ లాల్లో అత్యధికంగా రామగిరి మండలం 90.49 శాతం.. అత్యల్పంగా అనంతపురం రూరల్ మండలం 77.53 శాతం ఓటింగ్ నమోదైంది. ఆత్మకూరు మండలంలో 90 శాతం, రాప్తాడు మండలంలో 84.84 శాతం, కనగానపల్లి మండలం 89.88 శాతం, సీకేపల్లి మండలంలో 88.55 శాతం నమోదైంది.

ఎన్డీయే కూటమిదే విజయం

అనంతపురం అర్బన్ మే 14 : ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికే విజయకాశాలు మెండుగా ఉన్నాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఓటర్లు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాలు, సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని దివాళ దిశకు తీసుకువెళ్లిన జగన్‌రెడ్డికి జిల్లా ఓటర్లు ఓటుతో బుద్ధిచెప్పారని పేర్కొన్నారు. ఎన్డీయే కూటమికి సహకరించి ఓట్లు వేసిన ఓటర్లందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలింగ్ సవ్యంగా జరిగేందుకు సహకరించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మీరు చూపించిన చొరవ టీడీపీ ఎప్పటికీ మరువదన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి మంచి రోజులు వస్తాయన్నారు. జిల్లాలో అక్కడక్కడా చెదురుమదురు సంఘటనలు మినహా అన్ని ప్రాం తాల్లో పోలింగ్ సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకున్న జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగం, సిబ్బందికి ఆ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.34 వేలు

అనంతపురంరూరల్ : అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.34 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.22 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 121 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

అనంతపురం కల్చరల్ : స్థానిక నవయుగ కాలనీలోని పెద్దమ్మ దేవాలయంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టినిల్లు ఆశ్రమం, నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మళా మురళీ, సభ్యులు సౌదామిణి, కాలనీ సెక్రటరీ రాజు, భారతి, వరలక్ష్మి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.



బస్సుల రాకకోసం వేచిచూస్తున్నవైనం

ముగిసిన ఓట్ల జాతర

ఓటర్ల తిరుగు పయనం.. కిటకిటలాడిన బస్టాండ్

అనంతపురం కల్చరల్, మే 14: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం సాయంత్రానికి ముగిసింది. దీంతో ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారంతా సొంతూర్లకు చేరుకుని తమ ఓటుహక్కును వినియోగించుకుని మంగళవారం యదావిధిగా తిరుగుపయనమయ్యారు. ఈ నేపథ్యంలో రీజియన్‌లోని ఆర్టీసీ బస్టాండ్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతూ కనిపించాయి. బస్టాండుకు బస్సులు చేరుకోగానే సీట్లు పట్టుకునేందుకు పోటీ పడ్డారు. పలు రూట్లలో బస్సుల రాకకోసం ప్రయాణికులు వేచి చూశారు.



సీట్ల కోసం ప్రయాణికుల పాట్లు

నిరుపేద కుటుంబానికి 'అమ్మ' అండ

అనంతపురం కల్చరల్, మే 14 : బుక్కరాయసముద్రం మండలం జంతులూరు గ్రామంలో నివసిస్తున్న నిరుపేద కుటుంబమైన బళ్లారి రవికుమార్ కుటుంబానికి అమ్మ సంస్థ అండగా నిలిచింది. బళ్లారి రవికుమార్ ట్రాక్టర్ డ్రైవర్. అతనికి భార్య లక్ష్మిదేవి, ముగ్గురు కుమార్తెలు. మొదటి ఇద్దరు కుమార్తెలు మానసిక వికలాంగులు. చిన్నకుమార్తె ఆరో తరగతి చదువుతోంది. ఇదిలాఉండగా ఇటీవల రవికుమార్ బైక్ ప్రమాదానికి గురై వెన్నెముక దెబ్బతినడంతో ఇంటికే పరిమితమయ్యాడు. భార్య లక్ష్మీదేవి రోజువారీ కూలీ పనులకు వెళ్లి రోజూ రూ.200లు కూలీ తెచ్చుకుని భర్త వైద్యఖర్చులు చూసుకోవడంతోపాటు పిల్లల పోషణ చూసుకునేది. దీంతో ఆర్థికభారం భరించలేక అమ్మ సంస్థను ఆశ్రయించింది. ఆ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి మంగళవారం ఆ కుటుంబాన్ని సందర్శించి, రూ.50 వేలు విలువ చేసే సరుకులను అందజేశారు. పిల్లల బట్టల కోసం మరో రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఇల్లు కట్టించి ఇస్తానని వారికి హామీ ఇచ్చారు.



సరుకులు, నగదు అందజేస్తున్న రమణారెడ్డి

బాబు పాలనలోనే ముస్లింల సంక్షేమం

అనంతపురం కల్చరల్, మే 14: ప్రస్తుత ఎన్నికల్లో చంద్రబాబు గెలుపు ఖాయమని, ఆయన పాలనలో రానున్న రోజుల్లో ముస్లిం లకు మంచికాలం రానుందని ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం ఐఎంఎం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఏడాది ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు టీడీపీకే అధికంగా ఓట్లు వేశారన్నారు. రాష్ట్రంలోని ముస్లింల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు, ఇస్లామిక్ బ్యాంక్ విధానంలో సబ్సిడీతో కూడిన వడ్డీలేని రుణాలు, నూర్ బాషా ఫెడరేషన్‌కు ప్రతి సంవత్సరం రూ.10 కోట్లు కేటాయింపు తదితర అంశాలను చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వన్నూర్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా

ఎన్నికల విధుల్లో ట్రాఫిక్ పోలీసులు

నగరంలో ట్రాఫిక్ జామ్

అనంతపురం క్రైం, మే 14 : ట్రాఫిక్ పోలీసులు రెండు రోజులుగా ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఈవీఎంలను తీసుకెళ్లే వాహనాలను, ఇతర వాహనాలను ట్రాఫిక్ మళ్లింపుపై దృష్టి పెట్టారు. సోమవారం రాత్రంతా విధుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని ప్రధాన సర్కిళ్లలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. మంగళవారం ఉదయం 10గంటల సమయం లో సప్తగిరి సర్కిల్‌లో వాహనదారులు ఇష్టారాజ్యంగా రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఓ అంబులెన్స్ వాహనం ఆ ట్రాఫిక్‌లో ఉండిపోయింది. అదే సమయంలో అటు వచ్చిన పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రిలోక్ కొంత సేపు ట్రాఫిక్ పోలీస్ పాత్ర పోషించాడు. ట్రాఫిక్‌ను క్లియర్ చేశాడు.



ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న త్రిలోక్




సప్తగిరి సర్కిల్‌లో నిలిచిపోయిన వాహనాలు, ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

ఎన్నికలపై కలెక్టర్ వినోద్ మార్క్

- నెల రోజుల్లోనే జిల్లాపై పట్టు
- నిత్యం సమీక్షలతో అధికారులు పరుగులు
- రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు
- తొలిసారి వందశాతం వెబ్ కాస్టింగ్

అనంతపురం టౌన్, మే 14: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో అనంత కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ తన మార్క్‌ను వేసుకున్నారు. గత కలెక్టరు గౌతమిరెడ్డి ఎన్నికలలో ఓటర్ల జాబితా నుంచి ఇతర వ్యవహారాలన్నింటిలో అధికార వైసీపీ నేతలకు అనుగుణంగా పనిచేస్తున్నారన్న విమర్శలు ప్రతిపక్ష టీడీపీ ఇతర పార్టీల నుంచి వెల్లువెత్తాయి. అందుకు అనేక ఆధారాలతో రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్లకు టీడీపీ ఫిర్యాదులు చేసింది. దీంతో గత కలెక్టరు గౌతమిని కేంద్ర ఎన్నికల కమిషన్ అనంత కలెక్టరు బాధ్యతల నుంచి తప్పించి బదిలీ చేసింది. ఆ తర్వాత అనంత కలెక్టరుగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వినోద్ కుమార్‌ను అనంత కలెక్టరుగా నియమించింది. ఆయన్ను ఏప్రిల్ 4న నియమించగా... అదేరోజు రాత్రి అనంతకు చేరుకున్నారు. ఐదో తేదీన బాధ్యతలు తీసుకున్నారు.

నెల రోజుల్లోనే జిల్లాపై పట్టు..

కలెక్టరు వినోద్ కుమార్ నెలరోజుల్లోనే జిల్లాపై పూర్తి పట్టు సాధించారు. ఆయన ఐఏఎస్‌కు ఎంపికైన తర్వాత శిక్షణ కోసం అనంత అసిస్టెంట్ కలెక్టరుగా ఈ జిల్లాలోనే ఏడాదిపాటు పనిచేశారు. ఆ శిక్షణ కాలమే ఇపుడు అనంత జిల్లాలో ఎన్నికల నిర్వహణపై పట్టు సాధించడానికి ఉపయోగపడింది. అంతకు ముందు కొందరు జిల్లాస్థాయి అధికారులు, కొన్నిశాఖల నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు ఓ వర్గంగా ఉంటూ అధికార వైసీపీ నేతలకు అన్నివిధాలుగా సహకారం అందించేవారు. వినోద్ కుమార్ వచ్చిన తర్వాత కూడా వారు అలాగే వ్యవహరించడానికి ప్రయత్నించగా కలెక్టరు పసిగట్టి అలాంటి వారిని ఎన్నికల కీలక బాధ్యతలు అప్పగించకుండా దూరం పెట్టారు. అప్పటికే ఎన్నికల అధికారులుగా ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతూ వారిని కమిషన్ నిబంధనల మేరకు పనిచేసేలా గట్టిగా ఆదేశాలిస్తూ కంట్రోల్‌లోకి తెచ్చుకున్నారు. మరోవైపు ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యం ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపైనా సమీక్షలు పెడుతూ ఆ మేరకు ఏర్పాట్లు, చర్యలు తీసుకోవడానికి అధికారులను పరుగులు తీయించారు.

తొలిసారి వంద శాతం వెబ్‌కాస్టింగ్...

అనంత జిల్లా చరిత్రలో తొలిసారిగా వందశాతం పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయించారు. జిల్లా కమాండ్ నుంచే ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడానికి ఏర్పాట్లు చేపట్టి పర్యవేక్షణ సాగించారు. సమస్యాత్మక కేంద్రాల విషయంలోను రాజకీ యనేతలకు తలొగ్గకుండా నిర్ణయాలు తీసుకున్నారు. గత కలెక్టరు గౌతమి ఉన్నపుడు జిల్లాలోని ఎనిమిది నియోజవర్గాలలో 1,032 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా నిర్ణయించారు. ఈ కేంద్రాల ఎంపిక విషయంలోను అధికార పార్టీ ఎమ్మెల్యేలు సూచించిన మేరకు టీడీపీ పట్టు ఉన్న గ్రామాల్లో ఉన్న కేంద్రాలను చేర్చి అక్కడ పోలింగ్ కాకుండా చూడాలని కుట్రలు పన్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ప్రస్తుత కలెక్టరు వినోద్ కుమార్ ఈ సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేకంగా డీఐజీ, ఎస్పీ, ఇతర డీఎస్పీల ద్వారా పక్కా సమాచారం తెప్పించుకొని జిల్లాలో 662 కేంద్రాలను మాత్రమే సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అక్కడ వెబ్ కాస్టింగ్‌తో పాటు ప్రత్యేకంగా వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసి... పోలింగ్‌ను పర్యవేక్షించారు. ఇదిలా ఉంటే ఎపుడు ఎన్నికలు జరిగినా ఏదో ఒక నియోజకవర్గంలో అల్లర్లు జరిగి.. రీపోలింగ్ జరిగేది. అయితే తొలిసారిగా రీపోలింగ్ ఎక్కడా జరగడం లేదు. ఇలా కొత్త కలెక్టరు వినోద్‌కుమార్ అనతికాలంలోనే ఎన్నికల నిర్వహణలో తన మార్క్‌ను వేసుకున్నారు.





కణేకల్లులో బారులు తీరిన ఓటర్లు

కణేకల్లులో 84.81 శాతం పోలింగ్

కణేకల్లు, మే 14: మండలవ్యాప్తంగా 84.81 శాతం పోలింగ్ నమోదైంది. 53,023ఓటర్లు ఉండగా పురుషులు 22,496 మంది ఓటుహక్కును వినియోగించుకోగా, మహిళలు 22,460 మంది ఓట్లు వేశారు. ఐదుగురు ట్రాన్స్‌జెండర్‌లు ఓటహక్కును వినియోగించుకున్నారు. 44,969 మంది ఓట్లు వేయగా 84.81 శాతం పోలింగ్ నమోదైంది. గోవులాపురం గ్రామంలో 1251 ఓట్లకుగాను పోలింగ్ బూత్ ఒకటే ఏర్పాటు చేయడం, రెండు గంటలపాటు ఈవీఎంలు మొరాయించడంతో రాత్రి 11 గంటలకు వరకు పోలింగ్ కొనసాగింది. ఓటు వేసేందుకు బెంగుళూరు, హైదరాబాద్ నుంచి అనేక మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కూలీలు భారీగా తరలి వచ్చారు. చిన్న చిన్న సంఘటనలు మినహా మండలవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

బొమ్మనహాళ్‌లో 86.39 శాతం

బొమ్మనహాళ్: మండలంలో 86.39 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. 58 పోలింగ్ బూత్‌లలో 46,680 మంది ఓటర్లు ఉండగా 40,329 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పురుషులు 23,209 ఉండగా 20,334 మంది ఓటు వేశారు. మహిళలు 23,458 మంది ఉండగా 19,986 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. హిజ్రాలు 13 మంది ఉండగా 9 మంది ఓటుహక్కును వినియోగించుకుని 86.39 శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

యల్లనూరులో 82 శాతం

యల్లనూరు: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 82.4శాతం పోలింగ్ నమోదైనట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్వేత తెలిపారు. మొత్తం 28944మంది ఓటర్లకు గాను 23873మంది ఓటుహక్కును వినియోగించుకున్నారన్నారు. వీరిలో పురుషులు 14486ఉండగా 12058మంది ఓటు వేశారని, మహిళా ఓటర్లు 14457మంది ఉండగా 11814మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పెద్దవడుగూరు: మండలంలో మొత్తం 46పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 36911. వీరిలో 31832మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా రాంపురం గ్రామంలో 98.35శాతం నమోదు కాగా అత్యల్పంగా మిడుతూరు గ్రామంలో 61.48శాతం పోలింగ్ నమోదైంది. మండలవ్యాప్తంగా 86.24శాతం పోలింగ్ నమోదైంది.

పుట్లూరులో 83 శాతం

పుట్లూరు: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రికార్డు స్థాయిలో పెరిగింది. ఎప్పుడూ లేనంతగా 83శాతం మేర పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 31005ఓటర్లు ఉండగా మహిళలు 15380మంది, పురుషులు 15625మంది ఉన్నారు. మొత్తం 31005మంది ఓటర్లకు గాను 25833మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 12836, పురుషులు 12997మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాగా మండలంలో సోమవారం రాత్రి 7గంటల వరకు పోలింగ్ జరిగింది.



ఓటు వేయడానికి వచ్చిన మహిళా ఓటర్లు

డీ హీరేహాళ్‌లో 89.73 శాతం

డీ.హీరేహాళ్: సోమవారం మండల వ్యాప్తంగా జరిగినటువంటి సార్వత్రిక ఎన్నికలు 89.73 పోలింగ్ జరిగినట్లు తహశీల్దార్ బాల ఈశ్వరరెడ్డి తెలియజేశారు. మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 43 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 36,853 ఓటర్లు ఉండగా సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం నాడు జరిగిన ఎన్నికలలో 33,067 మంది ఓటర్లు తమ ఓట్లను వినియోగించడంతో 89.73 శాతం పోలింగ్ జరిగినట్లు తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాలలో ఈసారి జరిగినటువంటి ఎన్నికలలో పోలింగ్ శాతం అత్యధికంగా నమోదైనట్లు తెలియజేశారు. మండలంలోని కొన్ని గ్రామాలలో రాత్రి 9 గంటల వరకు కూడా ఎన్నికల ప్రక్రియ కొనసాగించడం జరిగినది.

రాయదుర్గంలో 80.54 శాతం

రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికల్లో రాయదుర్గం పట్టణంలో 80.54 శాతం ఓటింగ్ నమోదైంది. ముఖ్యంగా 53,439 మంది ఓటర్లు ఉండగా అందులో 43,038 ఓట్లు పోలయ్యాయి. ముఖ్యంగా 22,068 మంది మహిళా ఓటర్లు, 20,969 మంది పురుషులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీని ప్రకారం మహిళా ఓటర్లు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ఉరవకొండలో 85.74 శాతం

ఉరవకొండ: నియోజకవర్గంలో 85.74శాతం నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,24,339కాగా, 1,92,388ఓట్లు పోలైయ్యాయి. వీరిలో పురుషులు 96,074, మహిళలు 96,297 మంది, థర్డ్ జెండర్స్ 18 ఓట్లు పోల్ అయ్యాయి. అత్యధికంగా 90.24శాతం నమోదైంది.

రాయదుర్గం మండలంలో 88.61 శాతం

రాయదుర్గంరూరల్: మండలంలో 88.61 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 19 పంచాయతీలకు గాను 39 బూత్‌లు 34,548 మంది ఓటుహక్కును కలిగి ఉన్నారు. ఇందులో పురుషుల ఓటర్లు 15,433 మంది, 15,180 మహిళా ఓటర్లు 30,613 ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవడంతో 88.61 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ చిట్టిబాబు తెలిపారు.

కూడేరులో 90.25 శాతం

కూడేరు: మండలంలో పోలింగ్ శాతం భారీగా పెరిగింది. ఇప్పేరు గ్రామంలో అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. మండలవ్యాప్తంగా 32, 264 మంది ఓటర్లు ఉన్నారు. 29, 117 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 90.25 శాతం నమోదు అయింది.



ఇప్పేరులో క్యూలైన్‌లో ఓటర్లు

సమాచారం.. గందరగోళం

తప్పుల తడకగా పోలింగ్ సమాచారం

ప్రజలకు అయోమయం

ns of 150-Guntakal Assembly Constituency

Number of persons who voted in the P.S.				Percentage o Votes
Male	Female	TG	Total	
99738	100411	30	203820	75.31

పోలింగ్‌పై ఎన్నికలసంఘం ఇచ్చిన తప్పులతడక సమాచారం ఇదే

గుంతకల్లు, మే14: గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్నికల సంఘం సక్రమ సమాచారాన్ని ఇవ్వడంలో ఘోరంగా విఫలమైంది. అధికారులు పోలింగ్ వివరాలు సైతం సక్రమంగా ఇవ్వలేక తప్పులతడకగా ఇచ్చి చేతులెత్తేశారు. స్థానిక ఆర్డీవో శ్రీనివాసరెడ్డిని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ఎన్నికల సంఘం నియమించింది. ఆ కార్యాలయం ఆధ్వర్యంలోనే నామినేషన్ల పర్వం, పోలింగ్ కార్యక్రమం ముగిసింది. అయితే ఆద్యంతం ఎన్నికల అధికారులు, సిబ్బంది నుంచి తగిన సమాచారం లభించక మీడియా ప్రతినిధులు, పార్టీల అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనవసరపు విషయాన్ని కూడా అత్యంత రహస్యంగా నడుపుతూ చుక్కలు చూపారు. నామినేషన్ల కార్యక్రమంలోనూ పట్టుమని పదిమంది నామినేషన్లు వేయకపోయినా సాయంత్రం 7 గంటలదాకా సమాచారాన్ని బహిర్గతం చేయలేదు. చేతులెత్తేశారు. సమాచారాన్ని అందించడానికి ఏర్పాటు చేసినా సకాలంలో వివరాలను తెలపాలంటూ నెత్తీనోరూ కొట్టుకుని బతిమాలినా ఏమాత్రం స్పందించకుండా, పారదర్శకంగా ఉంచాల్సిన వివరాలను కూడా అత్యంత గోప్యంగా ఉంచడానికి యత్నించారు. సమాచారాన్ని ఇవ్వడంలో ఆర్ఓ కార్యాలయం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చివరకు పోలింగ్ ముగిసిన 24 గంటల తర్వాత కూడా ఓట్ల వివరాలను సక్రమంగా ఇవ్వలేక చతికిలపడ్డారు. నియోజకవర్గంలో 2,70,648 ఓట్లు ఉండగా 75.31 శాతం ఓట్లు పోలైనట్లు సమాచారం ఇచ్చారు. కానీ పోలైన ఓట్ల పరిస్థితిని గమనిస్తే ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. పోలైన శాతాన్ని అనుసరించి 2,03,820 మంది ఓటర్లు ఓటు వేశారని లెక్క తేల్చారు. అందులో పురుషులు 99,738 మంది, స్త్రీలు 1,00,411 మంది, ట్రాన్స్ జెండర్లు 30 మంది ఓటువేసినట్లు తెలిపారు. అధికారులు ఇచ్చిన లెక్క ప్రచారం చూస్తే పురుషులు 75.02 శాతం, స్త్రీలు 72.95 శాతం, ట్రాన్స్ జెండర్లు 40 శాతం ఓటువేసినట్లుగా తేలుతుంది. మూడురకాల ఓటర్ల సగటు శాతం మొత్తం ఓట్ల శాతానికంటే తక్కువగానే ఉంది. వీరి ఓట్లను కూడితే మొత్తం పోలైన ఓట్ల కంటే 3,641 ఓట్లు తక్కువగా ఉన్నాయి. ఆ లెక్కన పోలింగ్ శాతం 93.96 శాతంగా తేలుతుంది. పోలింగ్ శాతం సరైనది అనుకుంటే ఓటర్ల లెక్క తప్పవుతుంది. ఓట్లు సరైనవే అనుకుంటే మొత్తం ఓట్ల సంఖ్య, పోలింగ్ శాతం తప్పవుతుంది. ఈ లెక్కను ఏమాత్రం సరిచేయకుండానే వివరాలను స్థానిక ఎన్నికల అధికారులు జిల్లా అధికారులకు పంపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచీ పారదర్శకత, కచ్చితతత్వాల గురించి ఎన్నికల అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. కానీ ఆచరణలో మాత్రం లేకపోవడం గమనార్హం.

కూటమి విజయం ఖాయం

అమిలినేని సురేంద్రబాబు



మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మే 14: సమష్టి కృషితో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో విజయం సాధించడం ఖాయమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ప్రజావేదిక వద్ద విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓపిగ్గా ఓటు వేసి, మార్పు దిశగా అడుగులు వేశారన్నారు. పోలింగ్ శాతం పెరగడం, అన్ని వర్గాల ప్రజలు మార్పు కోరుకోవడంతో కళ్యాణదుర్గంలో కూటమి విజయం సాధిస్తుందని అన్నారు. ప్రతి గ్రామం నుంచి పట్టణం వరకు నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి చేసి, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు శాయి శక్తులా కృషి చేశారన్నారు. వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలు, బెదిరింపులకు ఓటు అనే ఆయుధంతో ప్రతి ఒక్కరూ బుద్ధి చెప్పారన్నారు. ప్రజలందరూ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ, చంద్రబాబునాయుడు సీఎం కావాలన్న ఆకాంక్షతోనే ఓటింగ్ వేయడానికి భారీగా తరలివచ్చారని తెలుస్తోందన్నారు. ఓటింగ్ శాతం పెరగడం, ఉదయం నుంచి ఓటు వేసేందుకు ప్రజలు భారీగా తరలిరావడంతో వైసీపీ శ్రేణులు ఓటమి తప్పదని భావించి టీడీపీ వర్గీయులపై దాడులకు పాల్పడ్డారన్నారు. అయితే ప్రజలు కసిగా టీడీపీ వైపు ఓటు వేయడం జరిగిందన్నారు. కొత్తూరు గ్రామానికి చెందిన మహిళలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఏకంగా ఆసుపత్రిలోకి వెళ్లి మరీ వైసీపీ వర్గీయులు దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ఈ సంఘటన పోలీసులకు తెలిసినా, వారు కూడా ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉండిపోయారని విమర్శించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమిలో ఉత్సాహం.. వైసీపీలో నైరాశ్యం



కళ్యాణదుర్గం, మే 14: కూటమి శ్రేణులు గెలుపు ధీమా వ్యక్తం చేస్తుండగా వైసీపీ నాయకులు నైరాశ్యంలో ఉన్నారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుతున్నారని దీని ద్వారా తేటతెల్లమైందని కూటమి నాయకులు ఓటింగ్ సరళిపై వ్యాఖ్యానిస్తున్నారు. జూన్ 4 వరకు ఉత్కంఠ కొనసాగనున్నా, ముందే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ ఆనందాన్ని పంచుకుంటున్నారు.

ఓ వైపు కవ్వింపులు...దాడులు....

ఓ వైపు కవ్వింపులు... దాడులు... మరోవైపు అసహనం.. ఇదీ వైసీపీ శ్రేణుల తీరు. పోలింగ్ సరళి మేరకు వైసీపీ శ్రేణుల్లో నైరాశ్యం వ్యక్తమవుతోంది. అసహనం పెరిగిన నేపథ్యంలో నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, కళ్యాణదుర్గం రూరల్, కళ్యాణదుర్గం పట్టణం, శెట్టూరు మండలాల్లో దాడులకు పాల్పడ్డ సంఘటనలు చోటుచేసుకున్నాయి.

బెట్టింగుల జోరు....

కళ్యాణదుర్గం పట్టణం, రూరల్, కంబదూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి మండలాల్లో బెట్టింగుల జోరు ఊపందుకుంది. ఎంతవరకు మెజార్టీ వస్తుందోనని అంచనాలు వేసుకుంటున్నారు. పోలింగ్ పూర్తికాకముందే బెట్టింగులు స్పీడందుకున్నాయి.

టీడీపీకి పూర్వవైభవం వచ్చేనా..?

కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీకి కంచుకోటలా ఉండేది. 2024 ఓటింగ్ సరళిని బట్టి చూస్తే టీడీపీకి పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలాల వారీగా ఎంత మెజార్టీ వస్తుందని అంచనాలు వేసుకుంటున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గవ్యాప్తంగా 88.62 శాతం ఓటింగ్ శాతం నమోదైంది.

ఊపందుకున్న బెట్టింగ్‌లు

రూ.2కోట్ల వరకు జరిగినట్లు చర్చ

యాడికి, మే14: మండలవ్యాప్తంగా బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. ఇప్పటికే మండలంలో సుమారు రూ.2కోట్ల వరకు బెట్టింగ్‌లు జరిగినట్లు చర్చ జరుగుతోంది. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని రూ.1.50కోట్ల వరకు బెట్టింగ్ జరిగింది. లక్షకు లక్ష రూపాయలు ఇచ్చే విధంగా బెట్టింగ్ జరిగిందని సమాచారం. బెట్టింగ్ రాయుళ్లు ఇరువైపులా వారు మధ్యవర్తి దగ్గర నగదు ఉంచినట్లు చర్చించుకుంటున్నారు. బెట్టింగ్‌లను సమన్వయం చేసిన మధ్యవర్తికి 2శాతం కమిషన్ ఇచ్చేలా ఒప్పందం జరిగినట్లు చర్చ. ఈ బెట్టింగ్‌లు ఎన్నికల ఫలితాలు వచ్చేనాటికి ఇంకా ఎక్కువ అవుతాయనే చర్చ కొనసాగుతోంది.

తాడిపత్రి ఎమ్మెల్యే అభ్యర్థిపై

తాడిపత్రి ఎమ్మెల్యే అభ్యర్థిగా జేసీ అశ్మిత్‌రెడ్డి 12వేలకు పైగా ఓట్లతో గెలుస్తాడని రూ.50లక్షల వరకు బెట్టింగ్‌లు జరిగినట్లు చర్చ జరుగుతోంది. యాడికి మండలంలో వైసీపీ కంటే టీడీపీ ఒక్క ఓటు మెజార్టీ అయినా వస్తుందని బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. 2019ఎన్నికల్లో యాడికి మండలంలో వైసీపీ మెజార్టీ సాధించింది. ప్రస్తుత ఎన్నికల్లో ఓటింగ్‌శాతం పెరిగిందని టీడీపీకి కచ్చితంగా మెజార్టీ వస్తుందని ఆ వర్గాలు అంటున్నాయి.



మరుట్లలో పోలీస్ పికెట్

కూడేరు, మే 14: మండల పరిధిలోని మరుట్ల 1వ కాలనీలో పోలింగ్ రోజున ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే విషయంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన గొడవ ఘర్షణకు దారి తీసింది. దీంతో సీఐ శివరాముడు పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

సీఐ కారును ఢీకొన్న వాహనం

కళ్యాణదుర్గం రూరల్, మే 14: మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి సమీపంలో రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్ వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో మంగళవారం బోల్తా పడింది. కళ్యాణదుర్గంలో ఎన్నికల విధుల ముగించుకుని తిరుగు ప్రయాణంలో రాయదుర్గం వెళ్తున్న సీఐ కారును గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లింది. ఈ ఘటనలో సీఐ, డ్రైవర్‌కు కొద్దిపాటి గాయాలయ్యాయి.

ఎలుగుబంటి సంచారంతో గ్రామస్థుల్లో ఆందోళన



చెట్టుపై ఎలుగుబంటి(వృత్తంలో)

బొమ్మనహాళ్, మే 14: మండలంలోని దేవగిరి, ఉద్దేహాళ్, శ్రీనివాసక్యాంప్ గ్రామాల శివార్లలో ఎలుగుబంటి సంచరిస్తోంది. సోమవారం రాత్రి ఉద్దేహాళ్, శ్రీనివాసక్యాంప్ గ్రామాల శివార్ల మధ్యలో గ్రామస్తులకు కనపడగా వారు కేకలు వేయడంతో చెట్టుపైకి ఎక్కింది. మంగళవారం ఉదయం దేవగిరి కొండల్లో కంటపడింది. ఎలుగుబంటి సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రైతులు పత్తిపొలాల్లోకి వెళ్లేందుకు జంకుతున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుత్తి, మే14: గుత్తిఆర్ఎస్‌లో మంగళవారం మధ్యాహ్నం ఈదుర గాలులతో 11కేవీ విద్యుత్ వైర్‌పై చెట్టుకొమ్మలు విరిగిపడటంతో దాదాపు 2గంటలపాటు విద్యుత్ అంతరాయం నెలకొంది. మార్కెట్ యార్డు వద్ద ఈదురు గాలులతో చెట్టు కొమ్మలు విరిగి 11కేవీ విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. జేసీబీ సహకారంతో చెట్టు కొమ్మలను తొలగించి విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

తెరుచుకోని సచివాలయాలు



తెరచుకోని యాడికి తహసీల్దార్ కార్యాలయం

యాడికి, మే14: తహసీల్దార్ కార్యాలయం, యాడికిలోని సచివాలయాలకు మంగళవారం అధికారులు సెలవు ప్రకటించారు. కార్యాలయాల తలుపులు తెరవలేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాల వద్దకు వచ్చిన ప్రజలు వెనుదిరిగారు. ఎన్నికల పేరుతో నెలరోజుల నుంచి అధికారులు కార్యాలయాలకు రాలేదు. ఇప్పుడు ఎన్నికలు అయిపోయాయి కదా ఇప్పుడు ఎందుకు రాలేదో పక్కనే ఉన్న ఎంపీడీఓ కార్యాలయం పనిచేస్తోంది. హౌసింగ్ కార్యాలయం పనిచేస్తోంది. వీటికి ఏమైందో అని చర్చించుకోవడం కనిపించింది.



కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా పయ్యావుల కేశవ్ జన్మదిన వేడుకలు

ఉరవకొండ, మే 14: నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ మంగళవారం జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి కార్యకర్తలు కౌకుంట్లకు చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో ఏపీ రాష్ట్ర కాపునాడు జిల్లా గౌరవాధ్యక్షులు దండాప్రసాద్ ఆధ్వర్యంలో పయ్యావుల కేశవ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి, వెంకటాంపల్లి చిన్నతాండాలో కేశవ్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు బీసీ మారెన్న, రేగాటి నాగరాజు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్రహ్మయ్య, మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, నెట్టెం రామకృష్ణ, కుమ్మరి ధనుంజయ, మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, చాయాపురం నాగభూషణ, బ్యాళ్ల ఈశ్వరయ్య, సర్పంచులు సీతారాములు, రాము, మనోహర్, గోవిందు పాల్గొన్నారు.

విడపనకల్లు: పయ్యావుల కేశవ్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం విడపనకల్లు టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కౌకుంట్లకు వెళ్లి కేశవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్పంచ్ చంద్రశేఖర్, సినిమా రామాంజినేయులు, సీనియర్ నాయకుడు హనుమంతు పాల్గొన్నారు.

కూడేరు: కూడేరు మండలానికి చెందిన తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున తరలి వెళ్లి పయ్యావుల కేశవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

ఉరవకొండ, మే 14: వజ్రకరూరు మండల కేంద్రంలో మంగళవారం ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో సూరి(30) మృతి చెందాడు. ఉరవకొండ మండలం చిన్నముష్టూరు నుంచి ట్రాక్టర్‌లో బండలు వేసుకుని వెళ్తుండగా వజ్రకరూరు సమీపంలో ట్రాక్టర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ట్రాక్టర్‌లోని బండలు సూరిపై పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాయదుర్గంరూరల్, మే 14: మండలంలోని బొమ్మక్కపల్లి సోమవారం రాత్రి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో మల్లికార్జున, మహారాజు, రామాంజి బొమ్మక్కపల్లి నుంచి వడ్రవన్నూరుకు వస్తుండగా వెనుక వైపు నుంచి కారు ఢీ కొనడంతో గాయాలయ్యాయి. స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలింగ్ సరళిపై కాలవ ఆరా



17 ఎ ఫారాలను పరిశీలిస్తున్న కాలవ

రాయదుర్గం, మే 14: ఎన్నికల్లో పోలింగ్ సరళికి సంబంధించి కార్యకర్తలతో ఆరాతీస్తూ మంగళవారం కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో గడిపారు. ఎన్నికల ఏజెంట్లుగా పోలింగ్ కేంద్రాలలో ఉన్న వారు ఒక్కొక్కరుగా వారి నాయకులతో కలిసి 17ఎ ఫారాలను అందించడానికి ఆయన నివాసానికి చేరుకున్నారు. అనంతరం వారితో పోలింగ్ సరళి గురించి చర్చించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి కార్యకర్తలు, నాయకులు చేరుకుని వారి పోలింగ్ కేంద్రాలలో మెజార్టీ గురించి ఆయన వివరించారు. అంతే కాకుండా పోలింగ్ కేంద్రాలలో ఎదురైన ఇబ్బందులతో పాటు వైసీపీ వర్గాలు వ్యవహరించిన తీరు తదితర అంశాలపై ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

టీడీపీ కార్యకర్తలకు పరామర్శ



పరామర్శిస్తున్న శ్రావణిశ్రీ, ఆలం, కేశవరెడ్డి

పుట్లూరు, మే14: మండలంలోని ఓబులాపురం గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో గాయపడ్డ టీడీపీ కార్యకర్తలు రాంమోహన్, లోకనాథ్‌ను కూటమి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి మంగళవారం పరామర్శించారు. కారణాలను మండల కన్వీనర్ బాలరంగయ్య, గుత్తా శ్రీనివాసులు నాయుడును అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మాజీ సర్పంచ్‌కు...



పరామర్శిస్తున్న వెంకటశివుడు యాదవ్

గుత్తి రూరల్, మే 14: మండలంలోని లచ్చానిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుంకన్నను టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పరామర్శించారు. సుంకన్న సోమవారం సార్వత్రిక ఎన్నికలకు ఏజెంట్‌గా బూత్‌లో ఉన్న సమయంలో స్పృహతప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండంతో మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సుంకన్నను ఆయన పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రంగారెడ్డి యాదవ్, సుధాకర్ నాయుడు, మహేశ్వరరెడ్డి, రాము ఉన్నారు.

ఎన్నికల్లో గెలిచేశాం



ఆలూరులో గుమ్మనూరు జయరాం

గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, మే14: నిన్నటితో ఏపీ ఎన్నికల్లో టీడీపీ విజయకేతనం ఎగురవేసిందని, అందులో ఎటువంటి సందేహాలూ లేవని, తాను కూడా అదే తరహాలో గెలుస్తానని గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. సోమవారం రాత్రి పోలింగ్ పూర్తికాగానే జయరాం స్వగృహానికి వెళ్లారు. మంగళవారం అంతా ఇంట్లోనే ఉండి ఇంటి వద్దకు వచ్చినవారితో సరదాగా గడిపారు. ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ఎంతో సహకరించాయని, అందువల్లే కొత్త ప్రాంతమైనా గుంతకల్లు ఎన్నికలను సునాయాసంగా పూర్తిచేశానని తెలిపారు. అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించారు.

విజయం మనదే: నారాయణస్వామి

గుంతకల్లు: ఎన్నికల్లో గుమ్మనూరు జయరాం మంచి మెజారిటీతో గెలుపొందుతారని, ఆ ఘనత పార్టీ శ్రేణులదేనని జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ శాతం ఎక్కువగా ఉండటం ప్రభుత్వ వ్యతిరేకతకు సూచనగా భావించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే వైఫల్యాల కారణంగా ఆ పార్టీ గుంతకల్లులో ఓడిపోనుందన్నారు. సహకరించిన కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, సంజీవరాయుడు, అంజి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ స్వామి